





విశాఖ నుంచి వర్చువల్‌గా పరిశ్రమలు ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

మరణ మృదంగం





శనివారం తెల్లవారుజామున మృతిచెందిన జీవమ్మ



నిన్న కూర్మాయిపల్లి.. నేడు బర్గూర్‌లో..
'కుంకీ' ఏనుగులకు శిక్షణ పూర్తయ్యేదెప్పుడో..
శాశ్వత పరిష్కారం చూపని పాలకులు
అటవీ శివారు గ్రామస్తులు గజగజ


డ్రోన్ కెమెరాలతో ఏనుగుల కదలికలను పరిశీలిస్తున్నామని, ఎప్పటికప్పుడు పరిశీలించి అవి ఎక్కడున్నాయో, ఏ గ్రామాల వైపు వస్తున్నాయో ముందుగా ప్రజలకు సమాచారం ఇస్తున్నామని కుప్పం ఎఫ్‌ఆర్‌ఒ జయశంకర్ తెలిపారు. అయితే రైతు కిట్టప్ప ప్రాణం పోకుండా, జీవమ్మ ఉసురు తీయకముందే ఎందుకు అప్రమత్తం చేయలేదన్నది అంతుచిక్కని ప్రశ్న. రక్షిత అటవీ ప్రాంతం చుట్టూ కందకాలు, సౌర ఫెన్సింగ్, నీటి వసతి, ఆహార సౌకర్యాలు కల్పించేందుకు కేవలం రూ.17 కోట్లు అవసరమని ప్రస్తుత చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి నాలుగు నెలలయ్యింది. అయితే ఇంతవరకూ ఆమోదించలేదు. తాజాగా నాలుగు రోజుల క్రితం పలమనేరు మండలం ముసలిమడుగుకు వచ్చిన అటవీ శాఖా మంత్రి పవన్‌కల్యాణ్ సైతం బాధితులను పరామర్శించకపోతే పోయారు, కనీసం ప్రతిపాదించిన నిధులు ఇస్తారో లేదో చెప్పలేదు. ప్రజల ప్రాణాలకు ఎటువంటి భరోసా ఇవ్వలేదు. పాలకుల నిర్లక్ష్యం వల్ల ఈ ఐదేళ్లలో 27 ఏనుగులు చనిపోగా, 32 మంది పైనే మనుష్యుల ప్రాణాలు గజదాడుల్లో పోయినట్లు సమాచారం.

ప్రజాశక్తి - కుప్పం

ఏనుగుల గుంపు ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు ప్రజలకు, అటవీ శివారు ప్రాంత గ్రామస్తులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఏనుగులు గ్రామాల వైపు రాకుండా దండోరా వేయిస్తున్నాం, డ్రోన్ కెమెరాలతో పరిశీలిస్తున్నామని అటవీ సిబ్బంది చెబుతున్నా 'గజదాడుల మరణమృదంగం' ఆగడం లేదు.. నిన్న కూర్మాయిపల్లిలో ఒంటరిఏనుగు కాలికింద రైతు కిట్టప్ప ప్రాణం పోయింది.. శనివారం వేకువజామున కుప్పం సరిహద్దులోని తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా బర్గూరు సమీపంలోని జగనికొల్లై గ్రామ సమీపంలో (ఆంధ్ర సరిహద్దుకు నాలుగు కిలోమీటర్లు) వ్యవసాయ పొలం వద్ద వృద్ధ దంపతులపై ఐదు ఏనుగుల గుంపు దాడికి పాల్పడింది. ఈ దాడిలో జీవమ్మ (63), గోవిందన్ (67) తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను బరుగూరు ఆస్పత్రికి తరలించగా జీవమ్మ మృతిచెందింది. గోవిందన్ చికిత్స పొందుతున్నాడు. గ్రామం వైపు వచ్చిన ఏనుగుల మందను వేకువజామున స్థానికులు, అటవీ సిబ్బంది పెద్దఎత్తున టపాసులు కాలుస్తూ కుప్పం అటవీ ప్రాంతం వైపు మళ్లించారు.

'దండోరా'తో సరి

తమిళనాడు వైపు నుండి ఏనుగులు వస్తుండడంతో అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో అటవీ సిబ్బంది దండోరా వేయిస్తున్నారు. ప్రధానంగా ఐదు ఏనుగుల గుంపు చెక్కు నత్తం, మల్లనరువైపు వచ్చే అవకాశం ఉండడంతో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. రెండు రోజుల క్రితం కూర్మాయి పల్లి వద్ద రైతు కిట్టప్పని చంపిన ఒంటరి ఏనుగు ప్రస్తుతం తమిళనాడులోని మహారాజగడై అటవీ ప్రాంతంలో సంచరిస్తోంది. దీనికి తోడు గుడిపల్లి మండలం శ్రీనివాసపురం సమీపంలో ఓ ఒంటరి ఏనుగు తిరుగుతుండగా రామకుప్పం మండలం ననియాల, ఆరిమానిపెంట పరిసర ప్రాంతాల్లో రెండు ఒంటరి ఏనుగులతో పాటు రెండు ఏనుగుల గుంపు సంచరిస్తోంది. దీంతో ఏనుగులు గ్రామాల వైపు వచ్చే అవకాశం ఉండడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ సిబ్బంది గ్రామాల్లో దండోరా వేయిస్తున్నారు.



జయంత్, వినాయక్ తిరిగొచ్చేనా..?

జయంత్, వినాయక్ తిరిగొచ్చేనా..?

కుప్పం ప్రాంతంలో ఏనుగు దాడుల నియంత్రణతో పాటు రాష్ట్రంలో ఎక్కడైనా ఏనుగులు దాడులు చేస్తే వాటిని అరికట్టేందుకు రామకుప్పం మండలం ననియాల ఎలిఫెంట్ క్యాంప్లో ఉన్న శిక్షణ పొందిన రెండు ఏనుగులను అధికారులు 6 నెలల క్రితం పలమనేరు సమీపంలోని ముసలిమడుగుకు తరలించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కర్ణాటక నుండి తీసుకువచ్చిన నాలుగు ఏనుగులకు శిక్షణ ఇచ్చేందుకు ననియాల వద్ద ఉన్న జయంత్, వినాయక్ లను పలమనేరుకు తరలించారు. దీంతో ననియాల ఎలిఫెంట్ క్యాంప్ కాస్త ఏనుగులు లేక బోసిపోయింది. అయితే ఇటీవల కాలంలో కుప్పం ప్రాంతంలో మళ్లీ ఏనుగుల సంచారం అధికం కావడంతో పలమనేరుకు తరలించిన జయంత్, వినాయక్ లను వెనక్కి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు. కర్ణాటక తీసుకొచ్చిన నాలుగు ఏనుగులకు శిక్షణ ఎప్పుడు పూర్తవుతుందో మరి. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రరాష్ట్రాల అటవీ శాఖ సిబ్బంది సమన్వయంతో ముందుకు పోతేనే ఏనుగుల ప్రాణాలు, మనుష్యుల ప్రాణాలను కాపాడేది.

వేధిస్తున్న సిబ్బంది కొరత...

కుప్పం రిజర్వ్ ఫారెస్ట్ 37 వేల చదరపు మీటర్లు విస్తరించి ఉండగా 14 బీట్లుగా విభజించారు. అయితే 44 మంది రెగ్యులర్ సిబ్బంది అవసరం ఉండగా ప్రస్తుతం కేవలం 18 మంది మాత్రమే ఉన్నారు. కుప్పం ఫారెస్ట్ పరిధిలో ఐదు బేస్ క్యాంపులు ఒక అనిమల్ ట్రాకర్ టీం ఏర్పాటు చేయగా ఒక్కదానిలో ఐదు మంది చొప్పున 30 మంది సిబ్బంది ఉన్నారు. మొత్తంగా కుప్పం ఫారెస్ట్ రేంజ్ విస్తీర్ణం చూసుకుంటే సిబ్బంది కొరత ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

సోలార్ ఫెన్సింగ్‌కు ప్రతిపాదనలు

కుప్పం రిజర్వ్ ఫారెస్ట్ చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్లు ఎఫ్‌ఆర్‌ఓ జయశంకర్ తెలిపారు. ప్రస్తుతం ఏడు కిలోమీటర్ల మేరకు సోలార్ ఫెన్సింగ్ పనులు దాదాపు పూర్తయ్యిందని, అయితే మరో 24 కిలోమీటర్లు వరకు సోలార్ ఫెన్సింగ్ వేసేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. దీనికోసం సుమారు మూడు కోట్ల రూపాయలు ఖర్చు కానుంది. అడవి జంతువుల నియంత్రణకు ప్రభుత్వం ఇటీవల చిత్తూరు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఏఐ టెక్నాలజీని వినియోగించిందని, అదే టెక్నాలజీని కుప్పంలో సైతం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.



'కరి' దాడులపై అవగాహనతో 'సరి'

శ్రీసిటీకి భారీ పెట్టుబడులు

ఉత్తమ పారిశ్రామిక నమూనాగా ప్రశంసలు
విశాఖ నుంచే ఐదు పరిశ్రమలు ప్రారంభం
12 కొత్త కంపెనీలకు ఎంఒయులు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

విశాఖ భాగస్వామ్య సదస్సు-2025 రెండో రోజు శ్రీసిటీ భారీ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా అయిదు కొత్త పరిశ్రమలను ప్రారంభించారు. 12 కొత్త కంపెనీలకు అవగాహనా ఒప్పందాలు కుదిరాయి. డైకిన్, ప్రోటీరియల్ (మెట్‌గ్లాస్), శ్రీసిటీ ఫేజ్-2 విస్తరణకు సంబంధించిన ప్రభుత్వ జీవోలను సంబంధిత సంస్థల సీనియర్ ప్రతినిధులకు సీఎం అందజేశారు. మొత్తంగా రూ.31,450 కోట్ల పెట్టుబడులు, 1.1 లక్షలకుపైగా (ప్రత్యక్షంగా 70,600, పరోక్షంగా 39,400) ఉద్యోగాల సృష్టికి అవకాశాలు లభించాయి. పరిశ్రమల మంత్రి టి.జి.భరత్, ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, పరిశ్రమల కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. శ్రీసిటీ ఉత్తమ పారిశ్రామిక నమూనా అని ముఖ్యమంత్రి ప్రశంసించారు. ప్రస్తుతం శ్రీసిటీలోని 31 దేశాల కంపెనీల సంఖ్య 50 దేశాలు, 500 కంపెనీలు, 1.5 లక్షల ఉద్యోగాల టార్గెట్ దిశగా కృషి చేయాలని శ్రీసిటీ ఎండి డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి నిర్దేశించారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం అదనంగా 2,500 ఎకరాలను మంజూరు చేసిందని సిఎం ప్రకటించారు. కనెక్టివిటిని మెరుగుపరచుకోడానికి త్వరలో శ్రీసిటీ సమీపంలో ఎయిర్‌స్ట్రిప్ నిర్మిస్తామన్నారు.

ఖుషీఖుషీగా 'విహారయాత్ర'

ప్రజా'దృష్టి'



ప్రజాశక్తి - తిరుపతి సిటీ

అటవీ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ రెండు రోజుల పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పర్యటించారు.. తిరుపతి పర్యటన అనంతరం తిరిగి హైదరాబాద్ వెళ్లి, మరుసటిరోజు మళ్లీ పలమనేరుకు విచ్చేశారు.. ఇటు రాయలచెరువు ముంపు బాధితులైన కళత్తూరు నిర్వాసితులను తిరుపతి జిల్లాలో పరామర్శించలేదు.. అటు పలమనేరు ముసలిమడుగు వద్ద ఏనుగుల దాడిలో బాధితులనూ పలకరించలేదు... ఏమైతేనేం రెండు రోజుల్లో రెండు రాష్ట్రాల్లో పర్యటించి మూడు కోట్లు ఖర్చు చేశారని తెలుస్తోంది. కేవలం 'పెద్దిరెడ్డి' అక్రమాలపై 'షో' చేసేందుకే విజిటింగ్ విహారయాత్ర చేశారా? అన్న అనుమానం కలగక మానదు.

డిప్యూటీ సిఎం ఈనెల 8, 9 తేదీల్లో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పర్యటించారు. పర్యటన షెడ్యూల్ అంతా గందరగోళం. 8వ తేదీ తిరుపతికి వచ్చి సుడిగాలి పర్యటన చేసి, ఈ బిజీ షెడ్యూల్లోనే మామండూరులో విహారయాత్ర చేసి, ఓ పుస్తకం సైతం చదువుతున్నట్లు ఫోజులిచ్చి అభిమానులను ఉత్సాహపరిచారు తప్ప తిరుపతి జిల్లావాసులకు ఒరిగిందేమీ లేదు. ఎర్రచందనంపై సమీక్ష చేసి 'ఆపరేషన్ కగార్' అంటూ పెద్దపెద్ద పదాలను వాడేశారు.. ఎర్రచందనం స్మగ్లింగ్ వెనుక ఉన్న 'అనకొండ'లు ఇంటిదొంగలే అన్నది అందరికీ తెలిసిన విషయమే. ఈ ఆపరేషన్ కగార్‌లో కూలీలు సమిధలు అవుతారే తప్ప, స్మగ్లర్లు ఎపుడూ సేఫ్. కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశానికి విచ్చేసిన పవన్‌ను కలిసి తమ గోడు వినిపించుకుందామని బాధితులు ప్రయత్నించినా అవకాశమే ఇవ్వలేదు. మరుసటిరోజు పక్కనే ఉన్న చిత్తూరు జిల్లాలో పర్యటించాల్సి ఉండగా, రాత్రికి హైదరాబాద్‌కు వెళ్లి మళ్లీ పలమనేరుకు మరుసటిరోజు విచ్చేయడం గమనార్హం. ఇదికాస్త విమర్శలకు తావివ్వడంతో మాజీ మంత్రి అక్రమాలను ఆధారాలతో సహా చూపించేందుకు డిప్యూటీ సిఎం సాహసోపేత పర్యటనకు వచ్చారని, ఆయన ధైర్యానికి హ్యాట్సాఫ్ అంటూ ఆ పార్టీ అధినేతలు పొగడ్తలతో ముంచేశారు. వాస్తవానికి మాజీ మంత్రి అటవీ భూముల వ్యవహారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బహిర్గతమయ్యింది. గతంలోనే మాజీ మంత్రితో సహా వారి కుటుంబ సభ్యుల్లో నలుగురిపై ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. డిప్యూటీ సిఎం రెండు రోజుల పర్యటనలో కొత్తగా శంకుస్థాపనలు లేవు. ప్రారంభోత్సవాలు లేవు, అభివృద్ధి కార్యక్రమాలు లేవు.. బాధితుల పరామర్శలు లేవు. కేవలం పరిశీలన, ఫొటోషూట్‌తో పర్యటన ముగిసింది. ఏదిఏమైనా పేదలకు 'పైసా' కేటాయించాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించే పాలకులు, హెలికాప్టర్లలో సుడిగాలి పర్యటనలు చేస్తూ ఏం ఒరగబెడుతున్నారో మరి.

మిస్టరీగా 'సతీష్' ఘటన

పథకం ప్రకారమే హత్యా..
తాడిపత్రికి సిఐడి బృందం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం పరకామణి కీలక సాక్ష్యాధారి మాజీ ఎవిఎస్‌ఒ సతీష్‌కుమార్ ఘటన మిస్టరీగా మారింది. దీంతో సిబిసిఐడి రంగంలోకి దిగింది. డిజి రవిశంకర్ అయ్యన్నార్ తాడిపత్రిలో మకాం వేసి విచారిస్తున్నారు. తమ అన్నది ముమ్మాటికి హత్యేనని సతీష్ తమ్ముడు శ్రీహరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హత్యకేసుగానే తాడిపత్రి పోలీసులు కేసు నమోదు చేశారు.



సతీష్‌కుమార్ మృతదేహం (ఫైల్)

పరకామణి కేసులో విచారణ నిమిత్తం తిరుపతి వెళ్లేందుకు గురువారం అర్ధరాత్రి 11.53 నిమిషాలకు సతీష్ కుమార్ గుంతకల్లు రైల్వేస్టేషన్‌కు వచ్చారు. ఎ1 29 సీటును రిజర్వు చేసుకున్నారు. గుంతకల్లు నుంచి రాయలసీమ ఎక్స్ ప్రెస్ లో తిరుపతికి బయలుదేరిన సతీష్ కుమార్ తాడిపత్రి సమీపంలో పట్టాల పక్కన శవమై కనిపించారు. గుంతకల్లు నుంచి తాడిపత్రి మధ్య ఏం జరిగింది అనేదే ఇప్పుడు కేసులో చిక్కుముడిగా మారింది. ఈ రెండు స్టేషన్ల మధ్య ఆయనపై ఎవరైనా దాడి చేసి చంపేశారా? లేక తీవ్ర ఒత్తిడిలో సతీష్ ఆత్మహత్య చేసుకున్నారా? అన్నది తేలాల్సి ఉంది. సతీష్ కుమార్ ట్రైన్ ఎక్కిన తర్వాత గంటకే ఏదో జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సమయంలోనే ఆయన నాలుగు మార్లు తన భార్యకు ఫోన్ చేయడం, అర్ధరాత్రి ఆమె ఫోన్ తీయకపోవడం వల్ల కంఫర్టుగా లేదంటూ మెసేజ్ చేయడాన్ని పోలీసులు గుర్తించారు. రైల్వే ఎస్ఐ కావడంతో పిస్టోల్, లగేజి సైతం కనిపించలేదు. ట్రైనులో తోటి పాసింజర్లతోపాటు గుంతకల్లు, గుత్తి రైల్వేస్టేషన్లలో రైలు ఎక్కిన పాసింజర్ల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. కేసును కొలిక్కి తీసుకువచ్చేందుకు సీన్ రీకనస్ట్రక్షన్ చేశారు. అయితే రైలు నుంచి పడిన సతీష్ కుమార్ తల వెనుక భాగంలో బలమైన గాయాలు ఉన్నాయి. శరీరంపై మరెక్కడా కమిలిన లేదా విరిగిన ఆనవాళ్లు లేవని పోలీసులు చెబుతున్నారు. దీతో సతీష్ మరణం పెద్ద మిస్టరీగా మారింది. ఆయన తలపై ఎవరో బలంగా కొట్టి చంపేసి ఉండొచ్చని, అందుకే తలపై బలమైన గాయం అయిందన్న అనుమానాలను నివత్తి చేసుకునే దిశగా పోలీసుల దర్యాప్తు కొనసాగుతోందని అంటున్నారు.

కేసును సవాల్ గా తీసుకున్న పోలీసులు సుమారు 15 ప్రత్యేక బందాలుగా ఏర్పడి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. మరోవైపు పరకామణి కేసులో దర్యాప్తు చేస్తున్న సీఐడీ అధికారులు సతీష్ కుమార్ మరణంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 6న ఒకసారి విచారణకు హాజరైన సతీష్ కుమార్.. రెండోసారి విచారణకు వస్తుండగా శవమైపోవడాన్ని సీఐడీ సందేహిస్తోంది. గతంలో సతీష్ చెప్పిన సమాచారం మేరకు పరకామణి కేసుతో లింకున్న అనుమానితుల ప్రమేయం ఏమైనా ఉందా? అన్న దిశగా కేసు దర్యాప్తు చేయాలని తాడిపత్రి పోలీసులను సీఐడీ కోరినట్లు చెబుతున్నారు. సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ అనంతపురం వచ్చి, జిల్లా పోలీసులతో ఈ విషయమై చర్చించారు. దీంతో సతీష్ కుమార్ హత్య కేసును ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నదని, మిస్టరీ ఛేదించే క్రమంలో ఏదైనా సంచలన విషయం బయటపడుతుందా? అన్న ఉత్కంఠ కనిపిస్తోంది.

స్విమ్స్‌కు పార్థివదేహం విరాళం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



స్విమ్స్ - శ్రీ పద్మావతి మెడికల్ కాలేజ్ అనాటమీ విభాగానికి పార్థీవదేహాన్ని డొనేషన్ చేసినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. టీటీడీ సూపరింటెండెంట్ గా పనిచేస్తున్న టీటీడీ మహిళా సంఘం అధ్యక్షురాలు కట్టమంచి కెఎల్ ఇందిర భర్త డాక్టర్ కె.శివాజీ సీనియర్ ఫ్యాకల్టీ ఇన్ బోటనీ వైద్య విద్యావంతులు, అనేక విద్య సంస్థలలో విద్యా బోధన చేస్తూ మంచి పేరు ప్రఖ్యాతలు పొందారు. స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మరణించారు. మృతుడు కోరిక మేరకు కుటుంబ సభ్యుల సమ్మతితో, అయన సతీమణి, టిటిడి సూపరింటెండెంట్ కే.ఇందిరా డాక్టర్ కే శివాజీ (పార్థివ దేహాన్ని) స్విమ్స్, శ్రీ పద్మావతి మెడికల్ కాలేజ్ అనాటమీ విభాగానికి డొనేషన్ (దానం) చేశారు. స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్ వి కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, స్విమ్స్ వైద్యులు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వాళ్లు ఎంతో సహృదయంతో (పార్థివ దేహాన్ని) అనాటమీవిభాగానికి అందించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.


18న రాష్ట్రవ్యాప్త నిరసనలు : సిపిఐ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

దేశవ్యాప్తంగా దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు అధికమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను నిరసిస్తూ... సామాజిక న్యాయం, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం నవంబర్ 18న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర పార్టీ పిలుపు నిచ్చారు. అందులో భాగంగా తిరుపతి జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.

ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)



ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శనివారం తీర్పు నిచ్చారు. క్రైమ్ నెంబరు 22/2017 కేసులో ముద్దాయి తిరుపతి జిల్లా టీఎన్ పాళెం బీటు పరిధిలో అరెస్టయ్యాడు. ఈ వ్యక్తి తమిళనాడు, తిరువన్నామలై జిల్లా కు చెందిన అన్నామలై విజయకుమార్. ఇతను కోర్టుకు హాజరు కాకపోవడంతో న్యాయమూర్తి నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేశారు. దీంతో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి తీసుకుని వచ్చి, కోర్టులో హాజరు పరిచారు. కోర్టులో ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ. 6లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు అతనిని నెల్లూరు సెంట్రల్ జైలుకు అప్పగించారు.

తిరుమల అటవీ ప్రాంతంలో స్మగ్లర్లు అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):




తిరుపతి అటవీ క్షేత్రాధికారి సుదర్శన్ రెడ్డికి అందిన రహస్య సమాచారం మేరకు శ్రీ వెంకటేశ్వర నేషనల్ పార్క్ పరిధిలోని తిరుమల పాత పాపవినాశనం ప్రాంతంలో ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసి వారి వద్ద నుండి నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. తిరుపతి అటవీ క్షేత్రాధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ బీటు అధికారి, బేస్ క్యాంపు సిబ్బంది బీట్ పరిధిని తనిఖీ చేస్తుండగా శనివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో పాత పాపవినాశనం వద్ద శబ్దం రావడాన్ని గమనించి పరిశీలించగా అక్కడ ముగ్గురు వ్యక్తులు ఉండడాన్ని గమనించి వారి వద్దకు వెళ్లే ప్రయత్నం చేయడంతో ఆ ముగ్గురు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించగా వారిని వెంబడించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. 87 కేజీలు బరువు గల నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని తిరుపతి అటవీశాఖ కార్యాలయానికి తీసుకొచ్చామన్నారు. పట్టుబడిన వ్యక్తులు తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లాకు చెందిన అశోక్, రమేష్ గా గుర్తించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పట్టుబడిన ఎర్రచందనం దుంగల విలువ దాదాపు బహిరంగ మార్కెట్లో లక్ష రూపాయలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ దాడులలో తిరుమల డిఆర్ఓ ఎం.స్వప్నకుమారి, పాపవినాశనం బీటు ఎఫ్బిఓ జె.అఖిల్, మావిళ్లమంద (పాపవినాశనం) బేస్ క్యాంపు వాచర్లు పాల్గొన్నారు.

9 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి - చంద్రగిరి



తిరుపతి జిల్లా చంద్రగిరి-శ్రీవారిమెట్టు మార్గంలో కారులో అక్రమంగా రవాణా చేస్తున్న 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. రవాణాకు ఉపయోగించిన కారును సీజ్ చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ ఎండీ షరీఫ్ మార్గ నిర్దేశకత్వంలో ఆర్ఐ సాయి గిరిధర్ కు చెందిన ఆర్ఎస్ఐ టీ.విష్ణువర్ధన్ కుమార్ టీమ్ శుక్రవారం నుంచి శ్రీవారిమెట్టు పరిసరాల్లో కూంబింగ్ చేపట్టింది. శనివారం తెల్లవారుజామున చంద్రగిరి-శ్రీవారిమెట్టు మార్గంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ మార్గంలో వేగంగా వస్తున్న ఒక కారు పోలీసులను చూసి, కొద్దిదూరంలోనే ఆగింది. పోలీసులు కారును సమీపించే లోపు కొందరు వ్యక్తులు దిగి పారిపోవడానికి ప్రయత్నించారు. అయితే టాస్క్ ఫోర్స్ టీమ్ వారిని వెంబడించి, ఇద్దరిని పట్టుకోగలిగారు. వారిని తమిళనాడులోని కష్ణగిరి, ధర్మపురి జిల్లాలకు చెందిన వారిగా గుర్తించారు. కారులో తనిఖీ చేయగా 9ఎర్రచందనం దుంగలు లభించాయి. దుంగలతో సహా, ఇద్దరు స్మగ్లర్లను తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు. పట్టుబడిన వారిని డీఎస్పీ వీ.శ్రీనివాస్ రెడ్డి, ఎసీఎఫ్ జె.శ్రీనివాస్ లు విచారించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




'ప్రేమిస్తున్నా' సందేశాత్మక ప్రేమకథా చిత్రం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతికి చెందిన ప్రీతి నేహా హీరోయిన్‌గా తొలిసారి నటించిన 'ప్రేమిస్తున్నా' చిత్రాన్ని ఆదరించి తగిన ప్రోత్సాహం అందించాలని తిరుపతి జిల్లా ప్రజలకు హీరోయిన్ తండ్రి కొట్టే శివకుమార్ విజ్ఞప్తి చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్ లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీటీడీ ఫారెస్ట్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్న తాను 20 సంవత్సరములుగా తిరుపతి సుందరీకరణలో భాగస్వాములై స్వామివారికి భక్తులకు, తిరుపతి ప్రజలకు సేవ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తన కుమార్తె ప్రీతినేహ బెంగళూరులో బిబిఎ చదువుతూ ఉండగా ఆమె చురుకుతనం ,అందం చూసి తొలిసారిగా ప్రేమిస్తున్నా చిత్రంలో హీరోయిన్ గా అవకాశం దక్కిందని వివరించారు. ఇప్పటికే 96చిత్రాలలో బాల నటునిగా నటించిన హీరో సాత్విక్ వర్మ తొలిసారిగా హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో తన కుమార్తెకు తొలిసారిఅవకాశం రావడం అదష్టంగా భావిస్తున్నామన్నారు. గీతం స్కూల్ కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో మానవ సంబంధాలు మగ్యమై తాత్కాలిక శారీరక వాంఛతో ప్రేమలో పడి పెడదోవ పడుతున్న యువతను చైతన్యం చేసే విధంగా ప్రేమిస్తున్న చిత్రం వినూత్న సందేశాన్ని ఇస్తూ చిత్రీకరించడం జరిగిందన్నారు. వినూత్న ప్రేమ కథ చిత్రాన్ని ఆదరించి తిరుపతి హీరోయిన్ ప్రీతి నేహను ఆదరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కొట్టే శివకుమార్ మిత్ర బందం ఊరు బిండి మునిశేఖర్, ఎల్ సుబ్రహ్మణ్యం చౌదరి, కామసాని నరసింహారెడ్డి, విజయ శేఖర్ , రామకృష్ణ నాయుడు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతా ముఖ్యం : కమిషనర్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రతిరోజూ స్నానం చేయడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యంగా జీవించగలమని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. శనివారం నగరంలోని స్కావెంజర్స్ కాలనీలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఎపి గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, కార్పొరేటర్‌దూరి కుమారి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించండి

తిరుపతి సిటి : ప్రతి ఒక్కరూ బహిరంగ మల విసర్జన చేయకుండా, వ్యక్తి గత మరుగుదొడ్లు మాత్రమే వాడటం ద్వారా అంటు వ్యాధులు రాకుండా అరి కట్టిన వారవుతారని తిరుపతి ఈఎస్ ఐ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్యాంబాబు పేర్కొన్నారు. స్థానిక ఆర్. సి రోడ్ లోని ఈఎస్ ఐ ఆసుపత్రిలో శనివారం" స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర "లో భాగంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో బహిరంగ మల విసర్జన చేస్తే అంటు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, అలా చేయకుండా ప్రతి ఒక్కరిలో పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని చెప్పారు. ఆసుపత్రి ఆర్ ఎంఓ డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్, స్పెషల్ గ్రేడ్ సివిల్ సర్జన్ డాక్టర్ లుయు, వెంకయ్య, ఏఎన్ ఎస్ సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్‌కు శ్రీ గాయత్రి విద్యార్థులు




ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కి చెందిన విద్యార్థులు గురు తేజ, మోక్షిత్ రావులు అండర్ 14, అండర్ 17 కేటగిరిలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహించిన హాకీ టోర్నమెంట్‌లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి, 22వ తేదీ చంద్రగిరిలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌కి ఎంపికయ్యారు. విజేతలను స్కూల్ కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. స్టేట్ హాకీ టోర్నమెంట్‌లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనపరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధనపాల్‌కు సన్మానం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొదలియార్ డెవలప్మెంట్ అండ్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఎస్ఎన్ ధనపాల్‌ను టీడీపీ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ధనపాల్ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో, నగరి నియోజకవర్గం బీసీ సెల్ కార్యదర్శి డి.శ్రీనివాసులు, 10వ వార్డ్ అధ్యక్షుడు బి.రూపేంద్ర, 58వ బూత్ కన్వీనర్ ఎస్.సాయి కుమార్, 57వ బూత్ కో కన్వీనర్ డి.హరి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సదాశివం మొదలియార్, చైతన్య, గోవిందుడు, కళ్యాణ్, అంకయ్య, మురుగన్, వెంకటేష్, నాగరాజు, ఆరుముగం, ధన, మురుగేష్, శరవణ, శీను, కళ్యాణ్, శివ, కుమార్, బాబ్జి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

మురళీమోహన్‌కు సత్కారం



ప్రజాశక్తి - రామచంద్రాపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్ప్రైజెస్ అభివృద్ధి కమిటీ సభ్యులుగా నియమితులైన ఎస్.మురళీమోహన్(చిన్న బాబు) ను పలువురు ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. శనివారం ఉదయం కమ్మపల్లిలోని ఆయన స్వగృహంలో అనుపల్లి పంచాయతీకి చెందిన టిడిపి యువత ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు పంతల వెంకటేష్ నాయుడు, ఆకా దేవరాజులు, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బండి రమణారెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, పంతుల చిట్టిబాబు, బండి లీలా ప్రకాష్ రెడ్డి, నరసింహారెడ్డి, మధుసూదన్ రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పరామర్శ



ప్రజాశక్తి - యర్రావారి పాలెం: వైఎస్ఆర్సిపి చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి శనివారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ఎల్లమంద పంచాయతీ వైఎస్సార్ పార్టీ అధ్యక్షుడు రెడ్డప్ప నాయుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడటంతో పరామర్శించి భరోసా ఇచ్చారు. అలాగే వేంపల్లివారిపల్లికి చెందిన సుధాకర్ తల్లి గోవిందమ్మ మరణించడంతో కుటుంబాన్ని కలిసి నివాళులర్పించారు. గజ్జల వారి పల్లికి చెందిన నాగేశ్వర్ రెడ్డి అనారోగ్యంతో ఉండడంతో పలకరించారు. నెరబైలు పంచాయతీ పులిగోనుపల్లికి చెందిన వెంకటసిద్దులు కుమారుడు వివాహ నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. మోహిత్ రెడ్డి మండలానికి రావడంతో వైఎస్ఆర్సిపి నాయకులు భారీ సంఖ్యలో హాజరైనారు.

రేషన్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-కోట: కోట మండలం, తిమ్మనాయుడుపాలెం, కోట, కొక్కుపాడు గ్రామాల్లో ఉన్న రేషన్ షాపు దుకాణాలను సోమవారం తహశీల్దార్ కటారి జయ జయ రావు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా చౌక ధరల దుకాణం వారికి పలు సూచనలు చేశారు. రేషన్ షాపుల్లో అధికంగా నగదు వసూలు చేస్తున్నారా అనే కోణంలో లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. సరుకులు తూకం తక్కువగా ఉన్నాయని ఫిర్యాదులు వస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు. అవకతవకలుంటే అలాంటి డీలర్ల పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూమన చేసేది విషప్రచారం : టీడీపీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మాజీ ఏవీఎస్ఓ సతీష్ కుమార్ హత్యపై చేసింది విష ప్రచారమేనని, కూటమి ప్రభుత్వం నిష్పక్షపాతంగా పరకామణి కేసును ప్రత్యేక దర్యాప్తు బృందంచే విచారణ చేస్తున్న నేపథ్యంలో ఎటువంటి వ్యాఖ్యలు సమర్థనీయం కాదని, వీటిని ఖండిస్తున్నామని తిరుపతి మాజీ శాసన సభ్యురాలు మన్నూరు సుగుణమ్మ వ్యాఖ్యానించారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కుట్రలు చేసేది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అని, సిట్ అధికారులపై ఎక్కడ గాని రాజకీయ ఒత్తిళ్లు ఉండవని స్పష్టం చేశారు. పరకామణి కేసులో సాక్షులను, విచారణ ఎదుర్కొంటున్న వారికి పోలీసు శాఖ ప్రత్యేక రక్షణ ఏర్పాట్లను చేయాలని, విచారణ పూర్తయి న్యాయస్థానంకు నివేదిక చేరేవరకు రక్షణ కల్పించాలని పోలీసు శాఖను విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ, టిడిపి సీనియర్ నాయకులు వట్టికుంట శంకరనారాయణ, బుల్లెట్ రమణ, సురా సుధాకర్ రెడ్డి, మన్యం శ్రీనివాసులు, కృష్ణ యాదవ్‌లు పాల్గొన్నారు.

ముగిసిన నృత్య వాహిని



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో "నృత్య వాహిని"అంతర్జాతీయ సాంస్కృతిక మార్పిడి నృత్య మహోత్సవం (ఇంటర్నేషనల్ కల్చరల్ ఎక్స్చేంజి డాన్స్ ఫెస్టివల్) ముగింపు సభ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథి ఎస్వీవీవీ వీసీ ప్రొఫెసర్ వి.ఉమ పాల్గొని మాట్లాడుతూ ఈ కార్యక్రమం అత్యంత నిబద్ధతతో, సమగ్రంగా నిర్వహించ బడిందని ప్రశంసించారు. ముఖ్య అతిథి యస్వీయు వీసీ ప్రొఫెసర్ టి. నరసింగ రావు మాట్లాడుతూ "కళ, ముఖ్యంగా నృత్యం, మనసుకు శాంతి, ఆరోగ్యం, విజయాన్ని ప్రసాదించగల విశిష్ట శక్తి. ఇది వ్యక్తిత్వ వికాసానికి, విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన బాటలు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు, డైరెక్టర్లు, శాఖాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



ప్రజాశక్తి - రామచంద్రాపురం: గిరిజన విద్యార్థినుల ఉన్నతకి రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఉచిత సైకిల్స్ పంపిణీతో చేయూతనిస్తున్నదని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చినబాబు పేర్కొన్నారు. రామచంద్రాపురం మండలం, కమ్మపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశా లలో చదువుతున్న ముగ్గురు గిరిజన బాల, బాలికలకు శనివారం రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల వారి సౌజన్యంతో ఉచిత సైకిళ్లను చినబాబు చేతుల మీదుగా పంపంపిణీ చేశారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి పాఠ శాలకు నడిచి వచ్చే విద్యార్థులకు సైకిళ్లు ఉపయోగపడ తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు సభాపతి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని అక్కుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న ఇద్దరు గిరిజన విద్యార్థులకు రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సైకిళ్లను అందజేశారు. విద్యపై ఆసక్తి ఉండి సుదూర ప్రాంతాల నుంచి కష్టాలకోర్చి పాఠశాలకు వస్తున్న గిరిజనులను గుర్తించి తమ వంతు సాయం అందించడం ఆనందంగా ఉందని ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ తెలిపారు. హెచ్ఎం జయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటుపై మహిళల నిరసన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక బస్టాండ్ ఎదురుగా కొత్తగా ఏర్పాటు చేయాలనుకున్న గౌడ వైన్స్ మద్యం దుకాణాన్ని స్థానిక మహిళలు గట్టిగా వ్యతిరేకించారు. తమ కాలనీ పరిసరాల్లో మద్యం దుకాణం ఏర్పాటును అడ్డుకుని ఆందోళన చేపట్టారు. అధికారులు మహిళలకు మద్యం దుకాణం ఏర్పాటుకు లైసెన్సు ఇవ్వడం జరిగిందని చెప్పారు. అయినా మా కాలనీ వద్ద మద్యం దుకాణం వద్దని మహిళలు నిరసన కొనసాగించారు. తమ కాలనీలో మద్యం దుకాణం అనుమతిస్తే తాగుబోతుల అల్లర్లు, పెరుగుతాయని, చిన్నపిల్లలు, విద్యార్థులు అదే రోడ్డులో వెళ్ళాల్సి వస్తుందని కావున మద్యం దుకాణం ఉండకూడదని విజ్ఞప్తి చేశారు.

ప్రతి రైతుకూ యూరియా అందాలి

ప్రజాశక్తి -దొరవారిసత్రం : ప్రతి రైతుకు యూరియా అందే విదంగా చూడాలని సూళ్లూరుపేట శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ అధికారులకు ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని పిఏసిఎస్ కార్యాలయాన్ని ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా పంపిణి కార్డు ఉన్న ప్రతి ఒక్క రైతుకు విడతల వారిగా యూరియా అందజేయాలని తెలిపారు. ఆమె వెంట దేశం నాయకులు సంచి విజయ్, సుబ్రహ్మణ్యం, ఉదయకుమార్, నాగేంద్ర నాయుడు తదితరులున్నారు.

అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకోండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అనుమతులేకుండా నిర్మించబడిన భవనాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆన్ లైన్ (www.bps.gov.ap.in) ద్వారా నిర్ణీత రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్రమబద్ధీకరించుకోని యెడల, సదరు భవనాలపై మునిసిపల్ చట్టం ప్రకారం చర్యలు చేపడతామని తెలిపారు. అనుమతులు లేని లేఅవుట్ల ప్లాట్లను జనవరి 1వ తేదీ లోపు క్రమబద్ధీకరించుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పంచాయతీలకు ట్రాక్టర్ ట్రాలీలు మంజూరు

ప్రజాశక్తి - రామచంద్రపురం: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, చెత్తతో సంపద తయారీ కోసం ఇంటింటా చెత్త సేకరణ నిమిత్తం స్వచ్ఛ ఆంధ్ర మిషన్ నిధులతో పంచాయతీలకు ట్రాక్టర్ ట్రాలీలను ప్రభుత్వం మంజూరు చేసింది. మండలంలోని అనుపల్లె, నెత్త కుప్పం, కుప్పం బాదూరు, సి.రామాపురం, సొరకాయల పాల్యం గ్రామ పంచాయతీలకు ఆరు నెలల క్రితం స్వచ్ఛ ఆంధ్ర మిషన్ నిధులతో ట్రాక్టర్ ఇంజన్లు మంజూరు చేసి పంచాయతీలకు అప్పచెప్పారు. కానీ ట్రాలీలు లేకుండా ట్రాక్టర్ ఇంజన్లు నిరుపయోగంగా పంచాయతీ కార్యాలయం వద్ద దర్శనమిచ్చాయి. శనివారం స్వచ్ఛ ఆంధ్ర మిషన్ నిధుల ద్వారా ఐదు పంచాయతీలకు ట్రాలీలను పంచాయతీ కార్యదర్శులకు స్వాధీనపరిచారు. దీంతో చెత్తను డంపింగ్ యార్డ్‌లకు తరలించేందుకు సులభతరం అవుతుందని పంచాయతీ సిబ్బంది తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - చంద్రగిరి, రామచంద్రాపురం: చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో తిరుపతి, పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం, యర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాలకు సంబంధించిన పలువురికి సిఎంఆర్ఎఫ్ సహాయనిధి ద్వారా సుమారు 50 లక్షల 2 వేల 297 రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసింది. లబ్దిదారులకు చెక్కులను ఎమ్మెల్యే పులివర్తి నాని చేతులమీదుగా శనివారం అందచేశారు.

ప్రవీణ్‌కు సకల కళా వల్లభ అవార్డు



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతికి చెందిన విద్యావేత్త డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ను సకలకళా వల్లభ అవార్డు–2025 వరించింది. అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య 25 వ వార్షికోత్సవ మహోత్సవం (సిల్వర్ జూబ్లీ) సందర్భంగా ఆత్మీయ పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లాలోని తిరుపతి వాస్తవ్యులు ఎలమంచిలి ప్రవీణ్ బాల్యంలోనే తల్లిని పోగొట్టుకున్నా, 17 సంవత్సరాలకే తండ్రిని కోల్పోయినా, సాధారణ ప్రభుత్వ ఉద్యోగిగా కెరియర్ ప్రారంభించినా, అంచెలంచెలుగా ఎదుగుతూ తనకు వచ్చే ఆదాయంలోనే కొంత భాగం సేవా కార్యక్రమాలకి వెచ్చిస్తూ, ప్రతి రంగంలోనూ తనదైన ముద్ర వేశారు. ప్రతి రంగంలోనూ తనకంటూ ప్రత్యేకతను చాటుకున్నారు. పట్టుదలతో, అకుంఠిత దీక్షతో గత 30 సంవత్సరాలుగా వివిధ రంగాలలో దాదాపు 1000 సామాజిక కార్యక్రమాలు నిర్వహించటమే కాకుండా, దాదాపు 500 కార్యక్రమాలకు పైగా అతిథులుగా విచ్చేసి ఎన్నో, మరెన్నో అవార్డులు, ప్రభుత్వ పురస్కారాలతో పాటు స్థానిక, జాతీయ, అంతర్జాతీయ దాదాపు 50 (అర్థ సెంచరీ) పురస్కారాలను అందుకుని, విద్య, క్రీడా, సినిమా, కళా, సాంస్కృతిక, సాంఘిక, సేవా, వైద్య, వ్యవసాయ, ఆధ్యాత్మిక, వ్యాపార రంగాలలో వారు అందించిన విశిష్ట సేవలను పురస్కరించుకుని సకల కళా వల్లభ అవార్డును అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య వారు బహూకరించనున్నారు. ప్రముఖ న్యాయమూర్తి దేవు. నరసింహారావు చేతులు మీదుగా ఈ పురస్కారాన్ని ఎలమంచిలి ప్రవీణ్ అందుకోనున్నారు.


ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు జబ్బల సాయి ఒప్పందం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: నెల్లూరు జిల్లాలో 360 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఇథనాల్ పరిశ్రమకై జబ్బల సాయి ఎంఓయు(ఒప్పందం) చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో పారిశ్రామికవేత్తలతో నిర్వహిస్తున్నటువంటి పార్టనర్షిప్ సమ్మిట్ 2025లో కురుబ కుల రాష్ట్ర నాయకులు జబ్బల శ్రీనివాస్ కుమారుడు సాయి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజి భరత్ తో ఎంఓయు చేసుకుని, రాష్ట్ర అభివద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందించనున్నారు. ఈ సందర్భంగా కురబ సంఘం నాయకులు అతనికి అభినందనలు తెలిపారు.

లాసెట్ రెండవ విడత ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ తరపున శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నిర్వహణలో జరిగిన ఏపీ లాసెట్ అండ్ పీజీఎల్‌సెట్ 2025 అడ్మిషన్స్‌ల రెండవ విడత వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ 16 వ తేదీన మొదవవుతుందని కన్వీనర్ ప్రొ. సీతా కుమారి తెలిపారు. రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపులు నవంబర్ 16 నుండి 19 వరకు జరుగుతుందని, అభ్యర్థులు ప్రవేశ మార్గదర్శకాలు, ముఖ్యమైన తేదీలు, ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ https://lawcet-sche.aptonline.in ను సందర్శించాలని తెలిపారు.

విజయ్ కుమార్‌కు డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం శిక్షాశాస్త్ర విభాగంలో "సంస్కృత శిక్షామనోవిజ్ఞానం అధ్యయనానికి, అంతర్జాల ఆధారిత సంసాదనముల వికాసం, ప్రాయోగిక అధ్యయనం" అనే అంశంపై ఎస్.వి.విజయ్ కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఇన్చార్జి పరీక్షా నియంత్రకులు ప్రొ.ఎ.సచ్చిదానందమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షాశాస్త్ర విభాగంలో ప్రొ.ప్రహ్లాద, ఆర్.జోషి వరిష్ట ఆచార్యులు, కుమార భాస్కర వర్మ సంస్కృత పురాతన అధ్యయన విశ్వవిద్యాలయం, అస్సాంలో వైస్ ఛాన్సలర్‌గా ప్రస్తుతం పని చేస్తున్నటువంటి ప్రొ.జోషి మార్గదర్శకంలో ఎస్.వి విజయ్ కుమార్ తన పరిశోధన ప్రబంధాన్ని సమర్పించారు. కంప్యూటర్ సైన్స్ విభాగం ఆచార్యులు ప్రొ.బి.చంద్రశేఖరం పరిశోధనా కార్యానికి కో–గైడ్గా వ్యవహరించి యాప్ నిర్మాణంలో సహకరించారు. ఈ సందర్భంగా గైడ్ ప్రొ.ప్రహ్లాద.ఆర్.జోషి మరియు కోగైడ్ ప్రొ.బి.చంద్రశేఖరం విశ్వవిద్యాలయంలోని విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్, అభినందనలు తెలిపారు.

సతీష్ కుమార్ హత్య గొడ్డలి బ్యాచ్ పనే : కిరణ్ రాయల్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పరకామణి కేసులో కీలకమైన వ్యక్తి మాజీ ఏవీఎస్ఓ సతీష్ కుమార్‌ను హత్య చేసింది గొడ్డలి బ్యాచ్చేనని జనసేన పార్టీ తిరుపతి నియోజకవర్గం బాధ్యులు కిరణ్ రాయల్ అనుమానం వ్యక్తం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో చర్చ నియాంసమైన పరకామణి డాలర్ల కుంభకోణం కేసులు కీలకమైన వ్యక్తి సతీష్ కుమార్ అని, కొద్ది రోజులలో ఈ కేసుకు సంబంధించి తుది నివేదిక న్యాయస్థానానికి అందనున్న నేపథ్యంలో రైలు పట్టాల సమీపంలో విగత జీవిగా మారడం వెనుక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే ఉంటారన్నారు. సతీష్ కుమార్ ధర్మారెడ్డితో, వైవి సుబ్బారెడ్డితో టచ్ లో ఉన్నారని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ఎందుకంటే ఆరవ తేదీ తిరుపతిలో విచారణకు హాజరైన సతీష్ కుమార్ విచారణలో జరిగిన అంశాలను పూర్తిగా ధర్మారెడ్డికి, సుబ్బారెడ్డికి చేరవేసినట్లు అనుమానం కలుగుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే తిరుపతికి సతీష్ కుమార్ వచ్చే విషయాలను వారికి పూర్తిగా సమాచారం ఉందన్నారు. ఈ కేసుకు సంబంధించిన మరో కీలకమైన వ్యక్తి డాలర్లు దొంగతనం చేసిన రవికుమార్‌ను సురక్షితంగా విచారణ పూర్తయ్యేంతవరకు పోలీసు కస్టడీలో ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. రవికుమార్‌కు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించుకుంటే ఈ కేసుకు సంబంధించి వెనక ఉన్నవారు తప్పించుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. సిట్ అధికారులు వేగవంతమైన దర్యాప్తును చేస్తున్న నేపథ్యంలో ఫిర్యాదుదారుడు, కీలక సాక్షి అయిన సతీష్ కుమార్ ఎలా హత్య గావించడం తీవ్ర కలకలం రేపిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కిషోర్, ఆది, కేశవ, మనోజ్, పురుషోత్తం పాల్గొన్నారు.

జాబ్ మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పిచ్చాటూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సహాయ సహకారాలతో శనివారం ఎంకేటి మహల్, పిచ్చాటూరులె జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ జాబ్ మేళాలో ఎంపికయినవారికి రూ.13500 నుంచి రూ.25000 వరకు వేతనం లభిస్తుందని తెలిపారు. ఎంపిక కాని వారికి ఉచిత శిక్షణ ఇచ్చి మరలా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్ శిక్షణ నిమిత్తం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సత్యవేడు నియోజకవర్గ పరిధిలో మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గిరిజన కుటుంబాలకు ఆధార్ నమోదు

ప్రజాశక్తి - వాకాడు: మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రం వద్ద తూపిలి పాలెం గ్రామానికి చెందిన దాదాపు 50 గిరిజన కుటుంబాలకు ఆధార్ కార్డులు మంజూరు చేసే ప్రక్రియను మండల టిడిపి అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్ రెడ్డి శనివారం ప్రారంభించారు. మండలంలో ప్రతి ఒక్కరికి ఆధార్ నమోదయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని మధుసూదన్ రెడ్డి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయిప్రసాద్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయండి

ప్రజాశక్తి - చిల్లకూరు : పాలక మండలి సభ్యులు దేవాలయ అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. శనివారం చిల్లకూరు మండలం, తమ్మినపట్నం గ్రామం, కోదండ రామాలయం ఆలయ పాలక మండలి ఛైర్మన్, పాలక మండలి సభ్యులచే ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ శంకరయ్య మాట్లాడుతూ సతీష్ యాదవ్‌ను ఆలయ ఛైర్మన్‌గా నిర్ణయించినందుకు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీకోసం కష్టపడిన వారికి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు కోడూరు కీరవాణి, గుండాల లీలావతి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎమ్మార్వో శ్రీనివాస్‌లు, ప్రవీణ్ రెడ్డి, కడివేడు భాస్కర్ రెడ్డి, పెద్ద కాపు రామయ్య, కొన్నవోలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుత ఆయుర్వేద వైద్యశాల ప్రారంభం



ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): తిరుపతి, విద్యానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అచ్యుత ఆయుర్వేదిక్ హాస్పిటల్ కొత్త బ్రాంచ్ శనివారం ఆయుర్వేదిక్ కళాశాల చైర్మన్ భువనేశ్వర రాజు, వైస్ చైర్మన్ ఉమాదేవి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆధునిక వైద్య విధానాలతో పాటు ఆయుర్వేదానికి కూడా సమాన ప్రాధాన్యం ఉందన్నారు. తిరుపతి ప్రజలు అచ్యుత ఆయుర్వేదిక్ హాస్పిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మెరుగైన ఆయుర్వేద చికిత్సా సదుపాయాలను తిరుపతి ప్రజలకు అందించేందుకు హాస్పిటల్ ఈ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

కొక్కుపాలెంలో పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - చిట్టమూరు: చిట్టమూరు మండలం, కొక్కుపాలెంలో శనివారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో చిట్టమూరు మండల పశు వైద్యులు డా.సురేంద్ర బాబు పర్యవేక్షణలో ఉచిత పశు గర్భ కోశ వ్యాధుల చికిత్స శిభిరం నిర్వహించారు. ఈ శిబిరంలో నట్టల నివారణకు, యదకు రాని పశువులకు మందులు, చూడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. గొర్రెలకు, దూడలకు పాల శాతాన్ని పెంచే మందులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దాసరి శ్రీనివాస రావు లింగ నిర్ధారణ విధానం, వీర్యం గురించి, గర్భ కోశ వ్యాదుల గురించి వివరించారు. డాక్టర్ సురేంద్ర బాబు మాట్లాడుతూ పశు సంక్షేమ పథకాలు, పశు గ్రాసాలు, దాణా, మినీ గోకులం షెడ్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వాకాడు ప్రాంతీయ పశు వైద్య శాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మంజుల, చిట్టమూరు మండల పారా స్టాఫ్, ఏహెచ్ఎలు, లింగారెడ్డి బాలి రెడ్డి, పెళ్లకూరు భాస్కర్ రెడ్డి, మల్లాపు మాధవ ఇతర పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రేమిస్తున్నా' చిత్ర యూనిట్ సభ్యులు బాహాబాహి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): తిరుపతి ప్రెస్ క్లబ్ వద్ద ఇటీవల విడుదలైన ప్రేమిస్తున్న చిత్ర యూనిట్ సభ్యులు ప్రెస్ మీట్ అనంతరం కాంప్లెక్స్ ఆవరణలో బాహాబాహీకి దిగారు. ఉదయం విలేకరుల సమావేశం నిర్వహించిన హీరోయిన్ ప్రీతి నేహా తండ్రి కొట్టే శివకుమార్ సాయంత్రం విలేకరుల సమావేశం మరోసారి నిర్వహించిన చిత్రంలో రెండవ కథానాయకుడిగా నటించిన యువతో వచ్చిన నగిరి చలపతి అనే చిత్రం యూనిట్ సభ్యుణ్ణి కొట్టే శివకుమార్ కర్ర తీసుకొని ఇష్టానుసారం కొట్టాడు. జరుగుతున్న తంతునంత మీడియా ప్రతినిధులు తమ సెల్ ఫోన్ల ద్వారా చిత్రీకరిస్తుండగా వారిపై కూడా దురుసుగా వ్యవహరించి సెల్ఫోన్లను లాక్కునే ప్రయత్నం చేశాడు. శివకుమార్. చిత్రం నిర్మాణం సమయంలో గానీ, ఇతర ఇతర సమస్యలు ఉన్నాయో గాని ఇలా బహిరంగంగా భౌతిక దాడులు చేయడంతో స్థానికంగా ఉద్రిత్త వాతావరణం నెలకొంది. బూతులు మాట్లాడుతూ నగిరి చలపతిని కర్రతో కొట్టే శివకుమార్ చితకబాదాడు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి - చంద్రగిరి: మహిళల ఆర్థిక అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. చంద్రగిరి, వెలుగు కార్యాలయం వద్ద మహిళా సంఘాల సభ్యులకు పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన కల్పించి, కోడి పిల్లలను అందించారు. మండలంలోని మహిళా సంఘాలలోని 70 యూనిట్లకు కోడి పిల్లలను అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భక్తుల భద్రత ముఖ్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ముక్కంటి భక్తుల భద్రత తమ తొలి ప్రాధాన్యతని శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఆలయ కంచు గడప వద్ద భద్రతా సిబ్బందితో కలిసి మెటల్ డిటెక్టర్లను పరిశీలించారు. సెలవు దినాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందనీ, ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని భద్రత సిబ్బంది తనిఖీలు చేపట్టాలని సూచించారు.

పేద విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్య బృందం దాతృత్వం

డాక్టర్ ధనుష్ ఆధ్వర్యంలో పాద రక్షలు పంపిణీ



ప్రజాశక్తి - పిచ్చాటూరు: కేవీబి పురం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, అంగన్వాడీ చిన్నారులకు పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య బృందం పాదరక్షలు పంపిణీ చేసి తమ దాతృత్వాన్ని చాటుకుంది. శనివారం పిచ్చాటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ధనుష్, మిత్రులు ఆధ్వర్యంలో వైద్య బృందం కేవీబి పురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చేరుకొని ఈ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ ధనుష్ మాట్లాడుతూ నేటి విద్యార్థులే భావి భారత పౌరులని.. వారు చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ధనంజయులు, సీ హెచ్ ఓ శివయ్య, పిచ్చాటూరు వైద్య బృందం, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్త, హెల్పర్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఆగిఉన్న లారీని ఢీకొట్టి.. విద్యార్థి మృతి



ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, నడింపల్లి వద్ద, పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. హైవే పార్కింగ్ జోన్‌లో నిలిచి ఉన్న లారీని పల్సర్ బైక్‌పై వస్తున్న యువకుడు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని అనుకూరపల్లి బంగారుపాల్యం ప్రాంతానికి చెందిన లక్ష్మీకాంత్ (20)గా చంద్రగిరి పోలీసులు గుర్తించారు. ఇతను వేము ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న విద్యార్థి అని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దొంగల ముఠా అరెస్టు



ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, తిరుపతి రూరల్ పరిసర ప్రాంతాల్లో ఇళ్లకు కన్నాలు వేసి, చోరీలకు పాల్పడుతున్న నేరస్తులను చంద్రగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పీలేరు–తిరుపతి రోడ్డులోని కెయంయం కాలేజికి సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు తిరుపతి వైపు నుండి, పీలేరు వైపుగా ఒక స్కూటర్ పై వస్తూ, తనిఖీలను గమనించి ద్విచక్ర వాహనాన్ని తిప్పుకుని పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని వెంబడించి పట్టుకున్నామని తెలిపారు. వారిని ధర్మవరానికి చెందిన నమ్మ రామాంజినేయులు సాయిరాం (25), తిరుపతికి చెందిన సత్య సారధి(29), చాట్ల నరేంద్ర (26)లుగా గుర్తించినట్లు తెలిపారు. విచారణలో వారు ఇళ్లకు కన్నాలు వేసి చోరీలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. వారి వద్ద నుండి 50 గ్రాముల బంగారు, 1100 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నామన్నారు. కోర్టుకు అప్పగించనున్నామని తెలిపారు.

కుటుంబ కలహాలతో భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : కుటుంబ కలహాలతో భర్త ఫ్యానుకి ఉరేసుకుని మృతి చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. ప్రశాంత్ కుమార్(32) ఎనిమిదేళ్ల కిందట వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు సంతానం. అయితే ప్రశాంత్ కుమార్‌కు గత కొంతకాలంగా భార్యతో కలహాలు ఏర్పడ్డాయి. దీంతో భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. మనస్థాపానికి గురైన ప్రశాంత్ కుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్ ఫార్మర్‌లోని రాగి వైరు చోరీ

ప్రజాశక్తి - బాలాయపల్లి: మండలంలోని అంబలపూడి గ్రామానికి చెందిన దుర్గ రత్నమ్మ తోటలో ఉన్న ట్రాన్స్ఫార్మర్‌ను శుక్రవారం రాత్రి దుండగులు పగులగొట్టి రాగి వైరును చోరీ చేశారు. ఈ విషయమై రత్నమ్మ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థినులకు ఆత్మరక్షణపై శిక్షణ

ప్రజాశక్తి - వరదయ్యపాలెం : కారెపాకం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, రాష్ట్ర ప్రభుత్వం, సమగ్ర శిక్షా అభియాన్ కార్యక్రమం ఆధ్వర్యంలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. రూపేష్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఈ శిక్షణ నవంబర్, డిసెంబర్ మాసాల్లో నిర్వహిస్తారని ప్రధానోపాధ్యాయులు రవీంద్రారెడ్డి తెలిపారు. కరాటే మాస్టర్ కన్నయ్య విద్యానులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుష్యంత రెడ్డి, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, మోతీలాల్, మునెమ్మ, ఏడుకొండలు, శ్రీనివాసులు, మనోహర్, చిన్న బాబు, దేవిరాజి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : డిసెంబర్ 13 న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ రమ్య సాయి సూచించారు. అదనపు జూనియర్ కోర్టు హాల్‌లో పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్ సి రాఘవేంద్ర ఆదేశాల మేరకు పోలీస్ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో ఆమె మాట్లాడుతూ రాజీ మార్గములో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనము ఆదా అవుతుందన్నారు.

యాంటెన్నాస్ పై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కాలేజ్ ఈ.సి.ఈ విభాగం ఆధ్వర్యంలో "ఫ్లెక్సిబుల్ అండ్ వేరబుల్ యాంటెన్నాస్ ఫర్ బయోమెడికల్ అండ్ ఐ.ఓ.టి అప్లికేషన్స్" పేరుతో ఐదు రోజుల ఎఫ్.డి.పీ కార్యక్రమాన్ని 11వ తేదీనుండి 15 వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆధునిక యాంటెన్నా సాంకేతికతలు, ఫ్లెక్సిబుల్ యాంటెన్నాల రూపకల్పన, బయోమెడికల్, ఐ.ఓ.టి అనువర్తనాలు, పరిశోధన పరికరాలు, సిమ్యులేషన్ సాధనాలపై విస్తృత శిక్షణ అందించారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా డా. వై. నీరజ, కోఆర్డినేటర్‌గా డా. పి. జనార్ధన్ సాయి కుమార్, కో–కోఆర్డినేటర్‌గా చందలూరు మోహన్ వెంకట శివ ప్రసాద్ బాధ్యతలు నిర్వహించారు.

అన్నదానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు, ఆరేటమ్మ గుడి వద్ద ఉన్న రామ లింగే శ్వర గుడి వద్ద అయ్యప్ప స్వామి భక్త బృందం అన్న దానం చేశారు.

ఐఐటి కేంద్రీయ విద్యాలయంలో వార్షిక క్రీడా దినోత్సవం

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు సమీపంలోని ఐఐటి కేంద్రీయ విద్యాలయం వార్షిక క్రీడా దినోత్సవాన్ని ఐఐటి ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. అట్లాటిక్స్ ఈవెంట్స్, గ్రూప్ గేమ్స్‌లో విద్యార్థులు పాల్గొన్నారు. ప్రో. ఈ. అనిల్ కుమార్, ప్రో. ఎన్ ఎన్ మూర్తి ముఖ్య అతిథులుగాను, డా. కనగశేకరణ, డా. అయ్యప్పన్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ట్రోపీలు, పథకాలు, సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.

తిరుపతిని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: విశాఖపట్నంలో రెండు రోజుల పాటు జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సుకు తన తనయుడు ఆరణి జగన్ తో కలిసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు కందుల దుర్గేష్, సవిత ఇతర అధికారులతో కలసి వివిధ స్టాల్స్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరిశీలించారు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రభుత్వం అంచనాకు మించి సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయం సాధించిందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రి నారా లోకేష్‌ల కృషి వల్లే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు పోటీ పడ్డాయని చెప్పారు. కేవలం సర్వీస్ సెక్టార్ పైనే ఆధారపడ్డ తిరుపతిని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి యువతకు ఉపాధి కల్పించాలని సీఎం చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరగా సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

స్నూకర్స్ టోర్నమెంట్ ప్రారంభం



ప్రజాశక్తి - క్యాంపస్ : లక్కీ బాల్స్ అండ్ బాయ్స్ స్నూకర్ అధ్యక్షులు గాలి రాజేష్ చౌదరి ఆధ్వర్యంలో శాప్ ఛైర్మన్ అనిమినీ రవి నాయుడు తిరుపతిలో నిర్వహిస్తున్న స్నూకర్స్ టోర్నమెంట్‌ను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ తిరుపతి నగరంలో ఇలాంటి క్రీడా పోటీల నిర్వహణ ఎంతో ఆనందకరమని, యువ క్రీడాకారులకు మరింత ఉత్తేజం కలిగించే కార్యక్రమాలు జరగాలని అభిలాషించారు. ఈ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేసినందుకు రాజేష్ చౌదరికి, వారి బృందానికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్ సందీప్, విష్ణు, తిరుపతి టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు హేమంత్ రాయల్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని వైసీపీ సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి నివాసంలో గూడూరు వైసీపీ ఎమ్మెల్సీ మేరిగ మురళి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాల విషయంలో చంద్రబాబు నారా లోకేష్‌లు బేరసారాలు మొదలుపెట్టారన్నారు. ఇకనైనా ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాడ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, బత్తిని విజయ కుమార్, జడ్పీటిసి యామిని తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చంద్రగిరి: కూటమి ప్రభుత్వం ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ వైసీపీ నాయకుల చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి గ్రామాల్లో భారీ స్పందన లభిస్తోందని వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పేర్కొన్నారు. పనపాకంలో కోటిసంతకాలు ఉద్యమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన వారిలో కసా గోపాల్, అమాస నాగేశ్వరరావు, చెంగల్ పండు, శేషాద్రి, సుదర్శన్, శివనాథం, సురేష్, హిమగిరి, రాము, సుబ్రమణ్యంలను హర్షిత్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపీపీ బొజ్జా వెంకటరత్నం, పార్టీ నేతలు అగరాల దేవారెడ్డి, చెంగల్రాయులు, కోటీశ్వర్ రెడ్డి, బొజ్జా ఆనంద, అమాస పవన్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర



ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నివారణ చర్యల్లో భాగంగా ప్రతి పంచాయతీలోని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. తడి, పొడి చెత్తను వేరు వేరుగా పారిశుధ్య సిబ్బందికి అందచేయాలని తెలిపారు. ప్లాస్టిక్ కవర్ల వాడకం నిలిపేయాలని సూచించారు. అనంతరం అధికారులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లోని సమస్యలు ప్రినిపాల్, ఎంఈఓలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కళాశాల ప్రాంగణంలోని బాలికల బీసీ హాస్టల్ శిధిలావస్థకు చేరుకుందని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను ప్రభుత్వం దృష్టి తీసుకెళతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సమాజంలో అధికశాతం జబ్బులు కేవలం వ్యక్తిగత, పరిసరాల అపరిశుభ్రత వల్లే వస్తాయని డాక్టర్ పి.రవిరాజు పేర్కొన్నారు. ప్రతినెలా మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పుత్తూరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వచ్ఛంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కోటేశ్వరయ్య, కన్వీనర్ డాక్టర్ వెంకటకృష్ణయ్య, డాక్టర్ పి.సుజన తదితరలు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - వాకాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం తహశీల్దారు సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీఓ సాయి ప్రసాద్‌లు సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టిడిపి అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులకు చేతులు పరిశుభ్రం చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు ఆనందం, నసీంఅలీ, టిడిపి మైనార్టీ నాయకుడు రహంతుల్లా, వేము దినకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ : తిరుపతి జిల్లా, బిఎన్ కండ్రిగ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరత్నమ్మ, తహశీల్దార్ శ్రీదేవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో స్వచ్ఛతపై అవగాహన పెంపు అవసరాన్ని వివరించారు.

ప్రజాశక్తి - వరదయ్యపాలెం : పరిసరాల శుభ్రతపై అవగాహన కలిగించే విధంగా నినాదాలు చేస్తూ స్థానిక బస్టాండ్ ఆవరణలో శనివారం మానవహారంగా ఏర్పాటు చేవారు. వరదయ్యపాలెం పంచాయతీ కార్యదర్శి బసిరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం ఒక ప్రభుత్వ కార్యాలయాన్ని ఎంచుకొని వాటి పరిసరాలను శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో ప్రతినెల మూడో శనివారం నిర్వహించే "పరిశుభ్రత– పచ్చదనం" కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఉపకులపతి ఆచార్య నర్సింగరావు, రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి, ఎన్‌యస్‌యస్. యూనివర్సిటీ కోఆర్డినేటర్ ఆచార్య దామోదరం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల, వామనరావు భవన్ పరిసరాల్లో జరుగుతున్న పరిశుభ్రత– పచ్చదనం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

తిరుమలలో ఆకర్షణీయంగా సూచిక బోర్డుల ఏర్పాటు

- ఉచిత బస్సుల సంఖ్య పెంపు
- పలు రాష్ట్రాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలి

: టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో శ్రీవారి భక్తుల సౌకర్యార్థం, వివిధ ప్రాంతాలను భక్తులు సులువుగా గుర్తించేలా సూచిక బోర్డులను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. టిటిడి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో శనివారం ఉదయం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. తిరుమలలో భక్తులు వివిధ ప్రాంతాలకు సకాలంలో చేరుకునేలా ఉచిత బస్సులను పెంచాలని సూచించారు. తిరుమలలో ఘన వ్యర్థాలను వేగంగా తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా టిటిడి ఆలయాలలో ఉత్సవాల సమయాలలో ఆలయాల సుందరీకరణలో భాగంగా గార్డెన్ విభాగం, ఎలక్ట్రికల్ విభాగాలు పరస్పరం సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇటీవల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కళా బృంధాలు శ్రీవారి భక్తులను ఆకట్టుకునేలా కళాప్రదర్శనలు ఇచ్చిన నేపథ్యంలో కళా బృందాలను అభినందిస్తూ ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు ఉత్తరాలు రాయాలని, సంబంధిత కళాబృందాల పోటోలను పంపాలని సూచించారు. అప్పలయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు సులువుగా గుర్తించి వెళ్లేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. తిరుపతిలోని టిటిడి ఉద్యోగులు నివాసం ఉండే వినాయక నగర్ క్వార్టర్స్‌లో పెయింటిగ్స్, క్లీనింగ్, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, ధార్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా ఉన్న టిటిడి భూముల మాస్టర్ డేటాబేస్‌ను ఏర్పాటు చేయాలని, కల్యాణ మండపాల నిర్వహణపై నివేదిక తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ఏజెన్సీ ఏరియాలలో ఆలయాల నిర్మాణాల కోసం భూసేకరణకు సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లకు ఉత్తరాలు రాయాలని సూచించారు. అదేవిధంగా వివిధ రాష్ట్రాలలో ఆలయాల నిర్మాణాలకు సంబంధించి సదరు రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలతో ఉత్తర ప్రత్యుత్తరాలను వేగవంతం చేయాలన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్, బస్టాండ్‌ల నుండి శ్రీవారి మెట్టుకు భక్తుల వెళ్లేందుకు ప్రైవేట్ వాహనదారులు భక్తుల నుండి అధిక ధరలు వసూళ్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, దీనిపై చర్యలు చేపట్టాలని విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారులను ఆదేశించారు. ఒంటిమిట్ట, అమరావతి, తిరుచానూరు ఆలయాల మాస్టర్ ప్లాన్‌లపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ఆలయాల్లో లైటింగ్, గ్రిల్స్, తదితర అంశాలపై ఆర్కిటెక్ అధికారుల సూచనలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిటిడి జేఈవో వి.వీరబ్రహ్మం, సివిఎస్వో కె.వి.మురళీకృష్ణ, ఎఫ్ఎ అండ్ సిఎవో ఓ.బాలాజీ, ఐటీ జీఎం డి.ఫణికుమార్ నాయుడు తదితర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఎస్‌కేఆర్ గవర్నమెంట్ కాలేజీలో శనివారం రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, ప్రమాదాలు, జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఆదినారాయణలు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ రాఘవ రెడ్డి, ధనంజయ రెడ్డి, సిద్ధారెడ్డి, సనత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుభాష్ పాలేకర్ కృషి ప్రసారకులు, సాధకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నీర్పాకోట పంచాయితీలో రైతుకు సంబంధించిన మిన్నల్ మోహన్ బయో ఇన్పుట్స్ తయారీ కేంద్రాన్ని బిఆర్సి ఓనర్ మించల మోహన్ ప్రారంభించారని తెలిపారు. రైతులు రసాయన ఎరువులకు స్వస్తి పలికి, పశువుల, ప్రకృతి వనరులతో సహజ సిద్ధంగాతయారు చేసే ఇన్పుట్స్ వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంథిల్ కుమార్ రెడ్డి, పలమనేరు బిఆర్సి సెంటర్ ఓనర్ మించాల్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ బాలికల ఉన్నత పాఠశాలలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి సిడిపిఓ పి.సంధ్య, సూపర్వైజర్ శ్రీదేవిలు మాట్లాడుతూ బాల్య వివాహాలతో ఎదురయ్యే అనర్ధాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఏ.భువనేశ్వరి, ఉపాధ్యాయులు, మహిళా పోలీసు రెడ్డి లీలాసాయి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ సరస్వతి శిశు మందిరంలో స్త్రీ సప్త శక్తి సంఘం కార్యక్రమం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : శ్రీ సరస్వతీ శిశు మందిరం పాఠశాలలో శనివారం స్త్రీ సప్త శక్తి సంగం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ గొప్పతనం గురించి, పర్యావరణ విషయాలు, మహిళలకు క్విజ్ పోటీలు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిచారు. అనంతరం డాక్టర్ రోహిణి, రాజ్యలక్ష్మి , సిహెచ్ వరలక్ష్మిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లావణ్య, వరలక్ష్మి, విన్నర్ క్లబ్ మెంబర్స్, పాఠశాల మహిళా పేరెంట్స్, పరిసర ప్రాంత మహిళలు మహిళా ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

నూతన ఆధార్ కేంద్రం ఏర్పాటు



ప్రజాశక్తి - చిట్టమూరు : చిట్టమూరు మండల కేంద్రంలోని సచివాలయంలో తహశీల్దార్ ఎం.నరేష్ చేతుల మీదుగా, టిడిపి మండల కన్వీనర్ కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో శని వారం ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, సిబ్బంది, టీడీపీ నాయకులు రాజగోపాల్ రెడ్డి, గుండుబోయిన కస్తూర య్య, నల్లారెడ్డి రాజేష్ రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.